తాగునీటి సమస్యను అధిగమిస్తాం

పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎంపీటీసీ ఆనందం

కులకచర్ల, మే 20 : మండల కేంద్రంలో తాగునీటి సమస్యను అధిగమిస్తామని కులకచర్ల ఎంపీటీసీ ఆనందం, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూర్ వెంకటేశ్ తెలిపారు. కులకచర్లలో ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పంచాయతీ పరిధిలో ఉన్న బావి పూడికతీత పనులను 15 రోజుల నుంచి చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనులను సోమవారం వారు పరిశీలించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బావి ద్వారా ప్రజలకు నిరంతరంగా నీటిని అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పనులు పూర్తయితే నీటి కొరత ఉండదన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు చంద్రకళ, భాను, వాటర్‌మెన్ యాదయ్య పాల్గొన్నారు.

క్రిమిటోరియంలో చెత్త తొలగింపును పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

పరిసరాల శుభ్రతకు ప్రత్యేక చర్యలు

కులకచర్ల, మే 20 : క్రిమిటోరియంలో శుభ్రతపై చర్యలు తీసుకుంటున్నామని కులకచర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం కులకచర్లలోని క్రిమిటోరియాన్ని పంచాయతీ సిబ్బంది ద్వారా శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో పరిసరాల శుభ్రతకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని కాలనీల్లో పరిసరాల శుభ్రత కోసం మురుగు కాల్వలను శుభ్రం చేయిస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని క్రిమిటోరియంలో పేరుకు పోయిన చెత్తను తొలగించి పరిశుభ్రంగా చేయించామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


పద్మమ్మ కుటుంబ సభ్యులకు రూ.20వేల చెక్కు అందిస్తున్న సీడీపీవో విజయలక్ష్మి

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

కొడంగల్, మే 20 : కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలంలో విధులు నిర్వహిస్తూ.. అనారోగ్య కారణంగా మృతి చెందిన అంగన్‌వాడీ టీచర్ పద్మమ్మకు ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.20వేల ఆర్థిక సహాయాన్ని సీడీపీవో విజయలక్ష్మి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దుద్యాల మండలంలోని అల్లిఖాన్‌పల్లికి చెందిన కొడంగల్ ప్రాజెక్టు అంగన్‌వాడీ టీచర్ వారం క్రితం అనారోగ్యంతో మృతి చెందిందని, ఆమె అంత్యక్రియలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సాయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశామని తెలిపారు. అలాగే దౌల్తాబాద్ మండలంలోని దేవర్‌ఫసల్‌వాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా విధులు నిర్వహించిన దస్తమ్మ మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు మణిమాల, ప్రభుతో పాటు సిబ్బంది మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటు మృతుల కుటుంబాలకు..

యాలాల : మండల పరిధిలోని బెన్నూరు, జుంటుపల్లి గ్రామాల్లో ఆదివారం పిడుగుపడి ముగ్గురు మృతి చెందారు. విషయం తెలుసుకొన్న బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి సోమవారం మృతుల కుటుంబాలను పరామర్శించారు. పిడుగుపాటుకు మృతి చెందిన బెన్నూర్‌లో గొల్ల ఎంకప్ప, జుంటుపల్లిలో మంగలి శ్రీనివాస్, కొన్నింటి లక్ష్మప్ప కుటుంబాలకు ఆర్థిక సాయంగా రూ.10వేల చొప్పున అందజేశారు. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి జరిగిన సంఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారన్నారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకొని ప్రతి కుటుంబానికీ రూ. 20లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేశారు.

మల్లికార్జునగిరిలో..

మర్పలి : మండలంలోని మల్లికార్జునగిరిలో భూమమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్‌కేఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి ఆమె అంత్యక్రియలకు రూ.5 వేలు పంపారు. ఈ నగదును స్థానిక నాయకుడు అశోక్ మృతురాలి కుటుంబీకులకు అందజేశారు.

బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ అందజేత

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్, మే 20 : బొంరాస్‌పేట మండలానికి చెందిన రాంచందర్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్సలో భాగంగా డాక్టర్లు ఆపరేషన్ చేయాలని సూచించడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం కోసం కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డిని ఆశ్రయించారు. దీంతో చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా రూ.2 లక్షల 75వేలు మంజూరు చేయించి సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ పత్రాన్ని అందించామని తెలిపారు.

పది నిమిషాల్లో రెండు సెల్‌ఫోన్ స్నాచింగ్‌లు

వెంగళరావునగర్, మే 20: నల్ల డ్రస్సు, ముఖాలకు మాస్కులు ధరించి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు 10 నిమిషాల వ్యవధిలోనే రెండు చోట్ల సెల్‌ఫోన్లు లాక్కొని పారిపోయారు. ఎస్ఆర్ నగర్ పీఎస్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలను పోలీసులు తెలిపారు. బెంగళూరుకు చెందిన హోటల్ ఉద్యోగి పి.రాజు సోమవారం ఉదయం 5 గంటలకు బల్కంపేట రోడ్డులోని ఆర్ అండ్ బీ కార్యాలయ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా.. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు రాజు చేతిలో ఉన్న సెల్‌ఫోన్ లాక్కుని సత్యం థియేటర్ వైపు పారిపోయారు. అటు నుంచి అమీర్‌పేట వెల్‌నెస్ దవాఖాన వద్ద ప్రైవేటు ఉద్యోగి సురేశ్ నడుచుకుంటూ వెళ్తుండగా.. బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు అతడి చేతిలో ఉన్న సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయారు. దీంతో బాధితులు ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తప్పుడు ప్రచారం.. పోలీసులకు ఫిర్యాదు

బాలానగర్, మే 20: బాలానగర్ మైక్రోస్మాల్ ఇండస్ట్రియల్ అసోసియేషన్‌లో అక్రమాలు జరిగాయంటూ తప్పుడు ప్రచారం చేసిన ఆ అసోసియేషన్ మాజీ జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్‌రెడ్డి, పలు యూట్యూబ్ చానళ్లపై బాలానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు బాలానగర్ మైక్రోస్మాల్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు అంబటి సునీల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్నేండ్ల కిందట బాలానగర్ మైక్రో స్మాల్ ఇండస్ట్రియల్ అసోసియేషన్‌పే ఏర్పాటు చేసి పారిశ్రామిక రంగం అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తాను చేస్తున్న కృషిని చూసి ఓర్వలేక అసోసియేషన్‌కు కొంతకాలంగా దూరంగా ఉంటూ, అసోసియేషన్ కార్యకలాపాలకు హాజరుకాకుండా ఉంటున్న జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్‌రెడ్డిని అసోసియేషన్ నియమావళి ప్రకారం సభ్యుల ఏకాభిప్రాయం మేరకు తొలగించడం జరిగిందన్నారు. ఇది జీర్ణించుకోలేని మాజీ జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్‌రెడ్డి అసోసియేషన్‌లో అక్రమాలు జరిగాయని, 15 కోట్ల స్కాం జరిగిందంటూ పలు యూట్యూబ్ చానళ్లకు చెప్పి తప్పుడు ప్రచారం చేశాడని వివరించారు. దీంతో వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు పలు యూట్యూబ్ చానళ్లపై కూడా బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

కొడంగల్‌లో కురుస్తున్న వర్షం

జోరువాన

దుద్యాల మండలంలో గాలివాన బీభత్సం, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

బొంరాస్‌పేట మండలంలో ఉరుములు మెరుపులతో వర్షం

కొడంగల్, మే 20 : మండల పరిధిలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం జోరుగా కురిసింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం వేడిగా, ఉక్కపోతగా ఉండి సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై వర్షం కురిసింది. దాదాపు అరగంటకు పైగా ఉరుములు, మెరుపులతో వర్షం కురియడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. గత మూడు రోజుల నుంచి ఓ మోస్తరుగా కురుస్తూనే ఉన్నది. దీంతో ఉక్కబోతతో ఇబ్బంది పడ్డామని సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం కురువడంతో వాతావరణం చల్లబడిందని స్థానికులు పేర్కొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు..

బొంరాస్‌పేట : బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. దుద్యాల మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. బలమైన ఈదురు గాలులకు పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దుద్యాల, వాల్యానాయక్‌తండాల్లో 12 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై స్తంభం విరిగిపడింది. దుద్యాల ఉన్నత పాఠశాలలో చెట్లు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పోలేపల్లిలోని రైస్‌మిల్లుకు 24 గంటలు విద్యుత్ సరఫరా చేసే తీగలపై ఎల్లమ్మ ఆలయం సమీపంలో చెట్టు కూలడంతో మూడు స్తంభాలు నేలకొరిగాయి. దుద్యాల పరిసర ప్రాంతాల్లో వడగళ్ల వర్షం కురిసిందని స్థానికులు తెలిపారు. వరి పొలాలు కోయడంతో పంటలకు నష్టం వాటిల్లలేదు. బొంరాస్‌పేట మండలంలోని పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడువకుండా రైతులు ప్లాస్టిక్ కవర్లు, టార్పాలిన్లు కప్పి ఉంచారు. దీంతో ధాన్యం తడవలేదు. గౌరారం గ్రామ పంచాయతీ పరిధిలోని బోయినిగడ్డ తండాలో ఓ ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. పక్క ఇంట్లో ఉన్న రాముకు విద్యుత్ షాక్ తగిలింది.

బొంరాస్‌పేట: వాల్యానాయక్‌తండాలో విరిగిపడిన విద్యుత్ స్తంభం

బొంరాస్‌పేట: దుద్యాలలో ఇంటి ఎదుట విరిగిపడిన చెట్టు

బొంరాస్‌పేట: పోలేపల్లిలో ఇంటి ఎదుట కూలిన విద్యుత్ స్తంభం

పిడుగుపాటుకు ఒకరి మృతి

- యాలాలలో 5 మేకలు మృతి
- బాధిత కుటుంబ సభ్యులను ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు

తాండూరు, మే 20: పిడుగుపాటుకు వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం తాండూరులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. పాత తాండూరుకు చెందిన శేఖర్ (40) కిరాణా దుకాణం నడిపిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన శేఖర్ వర్షం పడుతుందని ఓ చెట్టుకింద నిల్చున్నాడు. అంతలోనే ఉరుములు, మెరుపులతో భారీ శబ్దం చేస్తూ పిడుగు పడడంతో శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడే ఉన్న హన్మంతు (17) భయంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు. స్థానికులు వెంటనే తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుడు శేఖర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధుమిత్రులు కోరుతున్నారు. యాలాల మండలం హాజిపూర్ గ్రామంలో మొగులప్పకు చెందిన 5 మేకలు పిడుగుపాటుకు మృతి చెందాయి. రెండు రోజులుగా తాండూరు నియోజక వర్గంలో నలుగురు వ్యక్తులు, 5 మేకలు పిడుగు పాటుకు మృతి చెందడంపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బాధిత కుంటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రభుత్వం నుంచి తప్పకుండా సహాయం అందిస్తామని ప్రకటించారు.


మృతుల కుటంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ పరామర్శ

రెండు రోజుల క్రితం యాలాల మండలంలో పిడుగుపాటుతో మృతి చెందిన వెంకటయ్య, శ్రీనివాస్, లక్ష్మయ్య అనే రైతు కూలీల కుటుంబాలను ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి పరామర్శించారు. ఒక్కో మృతుడి కుటుంబానికి రూ.10 వేల చొప్పున నగదును అందజేశారు. ప్రభుత్వం నుంచి మృతుల కుటుంబాలకు సహకారం అందిస్తామన్నారు.

నకిలీ పాస్‌పోర్టు కేసులో మహిళకు రిమాండ్

నాంపల్లి కోర్టులు, మే 20 (నమస్తే తెలంగాణ): నకిలీ పాస్‌పోర్టు కేసులో 25వ నిందితురాలిగా తమిళనాడులోని తిరువళ్లూర్‌కు చెందిన మహిళ వరునియా తిరువణ్ణవుక్కరాసును సీఐడీ అధికారులు అరెస్టు చేసి, 12వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరుపర్చగా 14రోజుల పాటు రిమాండ్ విధించి చంచల్‌గూడ మహిళా కారాగారానికి తరలించారు. ఆమె తరపున దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌కు సోమవారం సీఐడీ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. పాస్‌పోర్టు ఏజెంట్ మురళీదరన్ అలియాస్ మురళితో ఏర్పడిన పరిచయంతో చెన్నైకి చెందిన ఏజెంట్ పర్థిబన్ ద్వారా ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్, ఓటర్ గుర్తింపు కార్డుతోపాటు విద్యను పూర్తి చేసినట్టు ఇతర పత్రాలను సైతం ఆమె పొందారు. ఈ పత్రాలన్నింటినీ జతచేసి ప్రధాన నిందితుడు సత్తార్‌తో పాటు అతడి అనుచరుల సహాయంతో ఆమె భారత పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్నది. భారత జాతీయత కలిగిన పాస్‌పోర్టు పొందెందుకు (ఏ1 నుంచి ఏ23) ఆమె రూ.2 లక్షలు చెల్లించింది. ఈ కేసులో ఉన్న ఏ1 నుంచి ఏ23 వరకున్న నిందితులందరూ కలిసి నకిలీ పాస్‌పోర్టు తయారు చేసేందుకు ప్రక్రియను పూర్తి చేశారు. తద్వారా పాస్‌పోర్టు నంబర్ యు6143208తో ఆమెకు భారత పాస్‌పోర్టు లభించింది. నకిలీ పత్రాలతోపాటు చిరునామ ఇ.నెం.7-1-302-17, జి1,యుషిత రెసిడెన్సీ, బస్తీ బీకేగూడ, ఎస్ఆర్ నగర్‌ను సైతం ఫేక్‌గా నమోదు చేశారు. ప్రధాన నిందితుడైన అబ్దుల్ సత్తార్, అతడి అనుచరులు ఫేక్ గుర్తింపు కార్డులైన ఆధార్, ఓటర్, రేషన్, పుట్టిన తేదీ పత్రాలు, విద్యకు సంబంధించిన సర్టిఫికెట్లను తయారు చేశారు. 10వ తరగతికి చెందిన మార్కుల పత్రంలో శ్రీలంక దేశీయుల పేర్లతో నమోదు చేసి సర్టిఫికేట్లను తయారు చేశారు. పత్రాల ఆధారంగా పాస్‌పోర్టులకు దరఖాస్తులు చేసుకున్నారు. భారత్ పాస్‌పోర్టు లభించడంతో ఆమె వీసాలతో విదేశాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నదని, నకిలీ పత్రాల ఆధారంగా రూపొందించిన పాస్‌పోర్టులు 100 వరకు ఉన్నట్టు దర్యాప్తులో గుర్తించినట్టు అధికారులు.. ఈ విషయాన్ని కౌంటర్‌లో పేర్కొన్నారు. నిందితురాలిని 8న రిమాండ్‌కు తరలించామని, బెయిల్‌పై విడుదలైతే నకిలీ పత్రాల ద్వారా విదేశాలకు ప్రయాణించే అవకాశమున్నదని, భారతదేశ సమగ్రతకు భంగం కలుగుతుందన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

బంజారాహిల్స్, మే 20: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కడప జిల్లాకు చెందిన మణికంఠ(33) బంజారాహిల్స్ రోడ్ నం. 14లో ఉంటున్నాడు. అతడికి ఆరేళ్ల కిందట సాయి మౌనికతో వివాహం జరిగింది. అయితే, ఇటీవల భార్యాభర్తల మధ్యన విభేదాలు తలెత్తడంతో ఏడాది కాలంగా వేరుగా ఉంటున్నారు. కాపురానికి రావాలని సాయి మౌనికను కోరేందుకు ఆదివారం మధ్యాహ్నం మణికంఠ ఇబ్రహీంనగర్‌లోని ఆమె ఇంటికి వెళ్లాడు. అయితే, తాను కాపురానికి వచ్చే ప్రసక్తే లేదంటూ మౌనిక తేల్చిచెప్పడంతో మనస్తాపానికి గురైన మణికంఠ.. అదే భవనంలోని మూడో ఫ్లోర్ నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న మృతుడి బాబాయ్ వెంకటరమణ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్న నిర్మాణ సామగ్రి

కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్, మే 20: రోడ్డుపై రాకపోకలకు అడ్డంకులు కలిగించేలా నిర్మాణ సామగ్రిని వేసిన ఇంటి యజమానిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. షేక్‌పేట నాలా సమీపంలోని గొల్కొండ లిక్కర్ మార్ట్ వెనుకాల ఉన్న వీధిలో రోడ్డు మొత్తం నిర్మాణ సామగ్రితో నిండిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అడ్డంకులు ఏర్పడుతుండటంతోపాటు ప్రమాదకరంగా ఉన్నాయని ఫిర్యాదులు అందుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. రోడ్డు పక్కనే వేసిన భారీ ఐరన్ రాడ్లతో ప్రమాదం పొంచి ఉన్నదని, తగు చర్యలు తీసుకోవాలని టోలీచౌకి ట్రాఫిక్ ఎస్ఐ ప్రేమ్‌రాజ్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఐపీసీ 341, 283, 336 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బొంరాస్‌పేట, మే 20 : మండల పరిధిలోని నాందార్‌పూర్ సమీపంలో కోస్గి రోడ్డు పక్కన సోమవారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రెండు, మూడు రోజుల క్రితం బైకుపై వెళ్తూ రోడ్డు పక్కన జారి చెట్ల పొదల్లోకి వెళ్లి చనిపోయినట్లు ఉంది. సోమవారం సాయం త్రం దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బైక్ నంబరు ఆధారంగా దోమ మండలం దాదాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు. వ్యక్తి మృతికి ప్రమాదమా లేదా మరేమైనా కారణమా తెలియాల్సి ఉంది.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

ఇంటర్ విద్యా జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్

వికారాబాద్, మే 20 : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 21వరకు పరీక్ష ఫీజు గడువు పెంచినట్లు ఇంటర్ విద్యా జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత కళాశాలలో రూ.2వేల ఆలస్య రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాలల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు తెలంగాణ ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఇంతకు ముందు ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

24న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా సమన్వయకర్త పరమేశ్వర్

వికారాబాద్, మే 20 : పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఈ నెల 24న జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా సమన్వయకర్త పరమేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం పాలిసెట్ పరీక్ష శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణకు వికారాబాద్ పట్టణంలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. వికారాబాద్‌కు జిల్లాకు చెందిన మొత్తం 1,321 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. వీరిలో కొంపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 240 మంది విద్యార్థులు, ఎన్నెపల్లిలోని భృంగి ఇంటర్నేషనల్ స్కూల్‌లో 600 మంది, వికారాబాద్‌లోని అనంత పద్మనాభ డిగ్రీ కళాశాలలో 481 మంది పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. విదార్థులందరూ ఉదయం 10 గంటల్లోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, 11 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్ష రాయడానికి అనుమతి లభించదని తెలిపారు. హాల్‌టికెట్‌తో పాటు పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్ తీసుకొని నిర్ణీత సమయంలోపు పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ నరేంద్రబాబు

వికారాబాద్, మే 20 : ఐటీఐ కోర్సుల్లో మొదటి విడుత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ నరేంద్ర బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కోర్సుల్లో 2024-25/26 విద్యా సంవత్సరానికి కళాశాలల్లో చేరేందుకు విద్యార్థినీ, విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు https://iti.Telangana.gov.in వెబ్ సైట్‌లో ఆన్‌లైన్‌లో మే 21 నుంచి జూన్ 16 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని 10, 8వ తరగతిలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9177472488/8555865421 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

గౌతాపూర్‌లో..

తాండూరు రూరల్ : మండల పరిధిలోని గౌతాపూర్‌లో ఉన్న ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆనంద్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్స్‌పర్‌టేక్ ఐటీఐలో ఎలక్ట్రిషన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, వెల్డర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, డ్రాఫ్ట్‌మెన్ (సివిల్)కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దేముల్, మే 20 : మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తాండూరు శాఖ డీఈ భానుప్రసాద్, ఏడీఈ ఆది నారాయణలు ఒక ప్రకటనలో తెలిపారు. పలు రకాల మరమ్మతులు చేపడుతుండడంతో గాజీపూర్, ఇందూరు, తట్టేపల్లి, కోట్‌పల్లి మండల ఉపకేంద్రం పరిధిలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

LOST OF DOCUMENT
I, BEDIGI SHIVASHANKAR, S/o. Sangappa, R/o. H.No. 4-1-107, Nehru Gunj, Tandur, Vikarabad Dist. I Lost My Original Registered Document bearing No. 418/99 while I was going to take a Photo copy/Xerox on 15-03-2024. If anybody found, please Contact: 8106949469

WANTED
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962